సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



అనకాపల్లి అదరహో 2లో
సామాజిక సాధికార సభ విజయవంతం



ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం
విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణంగా ఉందని అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ తెలిపింది. 2లో



షాట్లు కళ్లు చెదిరె..!
స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో గురువారం రాష్ట్ర అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభమైంది. 2లో

అడుగడుగునా బ్రహ్మారథం

- జిల్లాలో వేడుకగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం
- ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించిన ప్రజాప్రతినిధులు

దొండపర్తి : సాదర స్వాగతాలు.. అడుగడుగునా నీరాజనాలు.. ప్రతి నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణలు.. ఇలా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం జిల్లాలో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా ప్రజాప్రతినిధులు, సమన్వయకర్తలు వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అందించిన విప్లవాత్మక పాలన, చేసిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన బుక్లెట్లను ఆవిష్కరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన మేలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన ప్రణాళికలు, దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగారు. వెళ్లిన ప్రతి చోటా ప్రజలు ప్రజాప్రతినిధులకు అపూర్వ స్వాగతం పలికారు.



18వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- తూర్పు నియోజకవర్గంలో విశాఖ ఎంపీ, సమన్వయకర్త ఎం.వి.వి.సత్యనారాయణ 12, 18 వార్డుల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. అలాగే ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రగతికి తీసుకున్న చర్యలను వివరిస్తూ బ్రోచర్లను పంపిణీ చేశారు. మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావు, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి పాల్గొన్నారు.



రైల్వేన్యూకాలనీలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్నకేకే రాజు

- ఉత్తర నియోజకవర్గంలో సమన్వయకర్త కె.కె.రాజు రైల్వే న్యూకాలనీ 237 సచివాలయం వద్ద పలు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని సూచించే బోర్డ్‌ను ఆవిష్కరించారు. అనంతరం పాదయాత్రగా మూడుగుళ్ల ప్రాంతానికి వెళ్లి అక్కడ పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ముందుగా జాతీయ రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



పద్మనాభం: అనంతవరంలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

- భీమిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్రానికి జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమం ప్రారంభమైంది. ఆనందపురం మండలం పెద్దపాలెంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ నాలుగేన్నరేళ్లలో 4వ వార్డులో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వివరాలతో రూపొందించిన ఫ్లెక్సీని నియోజకవర్గం పరిశీలకుడు పసుపులేటి బాలరాజుతో కలిసి ప్రారంభించారు. దళారీ వ్యవస్థ లేని, వివక్ష చూపని పాలన కావాలంటే జగనన్నే మళ్లీ కావాలని పిలుపునిచ్చారు.



41వ వార్డు సుబ్బలక్ష్మి నగర్‌లో జగనన్న కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

- దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 41, 42 వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. సుబ్బలక్ష్మీనగర్–1, 2 సచివాలయాల పరిధిలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు వీసం రామకృష్ణ, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డి బాపు ఆనంద్, కర్రి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



యారాడ సచివాలయంలో డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

- గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి 64వ వార్డు యారాడలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాలుగున్నరేళ్లలో యారాడలో ప్రజలకు అందించిన రూ.18 కోట్ల సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన డిజిటల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవన్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను పాల్గొన్నారు.



పరవాడలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- పెందుర్తి నియోజకవర్గం ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన వివరాలతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వాటిని పంపిణీ చేస్తూ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ జి.కనకరాజు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ దేవి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



92వ వార్డు ఎస్సీబీసీ కాలనీలో పుస్తకాలు అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

- పశ్చిమ నియోజకవర్గంలో సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఈ బీసీ కాలనీ నుంచి పద్మనాభనగర్ వైఎస్సార్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. వార్డులో ఇంటింటికీ అందిన లబ్ధిని కుటుంబాల వారిగా వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్వీట్ షాపుల్లో తనిఖీలు



స్వీట్ షాపులో తనిఖీలు చేస్తున్న ఆహార భద్రత విభాగం అధికారులు

మహారాణిపేట: నగరంలోని స్వీట్ షాపుల్లో గురువారం ఆహార భద్రత విభాగం అధికారులు తనిఖీలు చేపట్టారు. గుంటూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆహార భద్రత విభాగం జిల్లా అధికారి జి.ఎ.బి నందజీ, ఫుడ్ సేఫ్టీ అధికారి జి.వి.అప్పారావు ఆధ్వర్యంలో చందు, శ్రీ శివరామ, దయారామ్, శర్వాణి, లడ్డూ గోపాల్, స్వీట్ ఇండియా స్వీట్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల్లో సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగించడం, గడువు ముగిసిన వస్తువుల విక్రయాలు, దుకాణాల వద్ద పరిశుభ్రత తదితర అంశాలు పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా ఆయా షాపుల్లో అనుమానం వచ్చిన జాంగ్రీ, హల్వా, గ్రీన్ హల్వా, లడ్డూ, బర్ఫీ, మిల్క్ మైసూర్ పాక్ తదితర 15 స్వీట్ల నమూనాలను సేకరించారు. వీటిని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలకు పంపినట్టు అప్పారావు తెలిపారు. అక్కడి నుంచి వచ్చిన నివేదికను బట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాలపై బెస్ట్ బిఫోర్ డేట్‌ను కనిపించే విధంగా ప్రచురించాలని దుకాణాల యజమానులకు నందజీ సూచించారు.

రేపు శ్రీవారి సన్నిధిలో లడ్డూల విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీన లడ్డూ విక్రయాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. 750 గ్రాములు ఉన్న కల్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు ఉన్న సాధారణ లడ్డూ రూ.50లకు విక్రయించనున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీవారి సన్నిధిలోని లడ్డూ విక్రయాల కౌంటర్ వద్ద లభిస్తాయని పేర్కొన్నారు.

తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నేవీ ఉద్యోగులు

సింధియా: తూర్పు నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో నేవీ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఈస్టర్న్ ఫ్లీట్ కమాండింగ్ ఫ్లాగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ గురుచరణ్‌సింగ్ ప్రారంభించారు. ఐఎన్‌ఎస్ శక్తిలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 150 మంది పురుషులు, స్త్రీలు స్వచ్ఛందంగా పాల్గొని, రక్తదానం చేశారు.

నాణ్యత పాటించకపోతే మెమోలివ్వండి

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి



అడవివరం హైస్కూల్‌లో భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

సాక్షి, విశాఖపట్నం: విద్యార్థుల భోజన విషయంలో నాణ్యత పాటించకపోయినా.. స్టాక్‌కు అనుగుణంగా రేషన్ దుకాణాల్లో సరకులు లేకపోయినా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్‌రావు, ఇతర శాఖల అధికారులతో కలిసి లక్ష్మిరెడ్డి చినగదిలి, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లోని పలు రేషన్ డిపోలను, రేషన్ పంపిణీ వాహనాలను తనిఖీ చేశారు. అంబేడ్కర్ నగర్‌లోని 228 నంబర్ రేషన్ డిపోలో స్టాక్‌తో పోల్చితే ఐదు క్వింటాల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషన్ సభ్యుడు రేషన్ షాప్‌పై 6ఏ కేసు నమోదు చేయాలని డీఎస్‌వోకు ఆదేశించారు. స్టాక్ సరిపడా లేకపోవడం, రిజిస్టర్ నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం పంపిణీ వాహనంలో పంచదార, గోధుమ పిండి స్టాక్‌లోనూ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. పంపిణీ వాహనదారుడు అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి.. తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న వాటికంటే అదనంగా గుడ్లు ఉండటంతో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సహాయకురాలికి మెమో జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరిని ఆదేశించారు. అడవివరంలోని జెడ్పీ హైస్కూల్‌లో భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అడివివరంలోనీ పూలే వసతి గృహంలో పిల్లలకు అందిస్తున్న భోజన విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కందిపప్పు, ఇతర సరకులు నాణ్యత లేనివి వినియోగిస్తున్నారని.. వాటిని పరీక్షించాలని జిల్లా ఫుడ్ కంట్రోలర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎం రాజేశ్వరి, డీఈవో చంద్రకళ, లీగల్‌మెట్రాలజీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రన్ వే మూసివేత వ్యవధి తగ్గించాలని వినతి

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం విమానాశ్రయం రన్ వే మూసివేత కాలవ్యవధిని తగ్గించాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావు తూర్పు నావికాదళ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌ను కోరారు. పెంధార్కర్‌ను గురువారం ఆయన కార్యాలయంలో కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆధునికీకరణ, నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ నెల 15 నుంచి రాత్రిపూట విశాఖ విమానాశ్రయం రన్ వేను మూసివేస్తున్నట్లు గతంలో నావికాదళం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రన్ వే మూసివేత కాలవ్యవధిని తగ్గించాలని ఎంపీ కోరారు.

విశాఖ.. వండర్‌ఫుల్ అండ్ క్లీనెస్ట్ సిటీ

- ఇక్కడ అభివృద్ధి ఇతర నగరాలకు ఆదర్శం
- జీవీఎంసీ ఆతిథ్యం మరువలేనిది
- కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్



కాపులుప్పాడలో ఎనర్జీ ప్లాంట్‌ను ఫోన్లో చిత్రీకరిస్తున్న కార్మెల్ మేయర్ జేమ్స్



జీవీఎంసీ కౌన్సిల్ హాల్ గురించి కార్మెల్ మేయర్‌కు వివరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

అల్లిపురం/మధురవాడ: గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు.. ఇతర నగరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్ అన్నారు. నగరంలో జీవీఎంసీ అభివృద్ధి చేసిన పలు ప్రాజెక్ట్‌లను అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావులతో కలసి గురువారం ఆయన సందర్శించారు. ముందుగా ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టు, తర్వాత కాపులుప్పాడలోని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఎండాడ వద్ద గల ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టు, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఆదర్శంగా, స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని కొనియాడారు. ఇంట్లో పనికి రాని వస్తువులతో వినూత్నంగా రూపొందించిన కళాకృతులను తిలకించి.. వాటిని తయారీ చేసిన వారిని అభినందించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్రక్రియ, బాయిలర్స్, ఫ్లూ గ్యాస్ తదితర విభాగాలను పరిశీలించారు. జిందాల్ ప్రతినిధులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో కార్యకలాపాలు బాగున్నాయని ప్రశంసించారు. తర్వాత ఏయూలోని అమెరికన్ కార్నర్‌ను సందర్శించి.. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. వర్సిటీలోని ఓపెన్ ఎయిర్ థియేటర్, ఆర్ట్స్ థియేటర్‌లో స్టూడియోలు, పలు విభాగాలను పరిశీలించారు. తర్వాత వన్‌టౌన్‌లోని రాస్ హిల్ చర్చిని సందర్శించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో కలిసి మేయర్ చాంబర్, కౌన్సిల్ హాల్, సిటీ ఆపరేషన్ సెంటర్‌ను పరిశీలించారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్, ఏపీ ఫెర్వాస్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆర్ మూర్తి, పలువురు అధికారులు ఆయనతో పరస్పర చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ విశాఖ నగరం, కార్మెల్ సిటీ 2023 జూలైలో సిస్టర్ సిటీస్‌గా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఒప్పందంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ ప్రశంసనీయమని కొనియాడారు. విశాఖ నగరం వండర్‌ఫుల్ అండ్ క్లీనెస్ట్ సిటీ అని.. తనను ఎంతో ఆకట్టుకుందని చెప్పారు. జీవీఎంసీ ఆతిథ్యం మరువలేనిదన్నారు. కార్మెల్ సిటీని సందర్శించాలని మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్లను ఆయన ఆహ్వానించారు.

మరణంలోనూ వీడని స్నేహ బంధం

- బైక్ అదుపు తప్పి ముగ్గురు మిత్రులు మృతి
- ఉక్కునగరం సెక్టార్–10లో దుర్ఘటన
- గంగవరంలో తీవ్ర విషాదం
- కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు



ప్రమాద స్థలంలో సోమేష్, వాసు మృతదేహాలు, డివైడర్‌పై పడి ఉన్న రాజు




ముగ్గురు స్నేహితులు (ఫైల్)



సంఘటనా స్థలంలో హెల్మెట్‌ను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

ఉక్కునగరం/పెదగంట్యాడ : తెల్లవారి లేచినప్పటి నుంచీ కలిసే ఉంటూ కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండే ముగ్గురు మిత్రులపై మృత్యువు పంజా విసిరింది. కూలి పనులు చేసుకుంటూ కన్నవారికి చేదోడుగా ఉంటున్న స్నేహితులను కబళించి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. గంగవరం గ్రామంలో తీవ్ర విషాదం నింపిన ఈ దుర్ఘటన ఉక్కునగరం సెక్టార్–10లో గురువారం మధ్యాహ్నం జరిగింది. ఘటనా స్థలిలోనే ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... గంగవరం ప్రాంతానికి చెందిన అర్జిల్లి సోమేష్ (19), కదిరి వాసు (19), కొవిరి రాజు (20) ఐటీఐ చదివి స్థానికంగా ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా ఉంటున్నారు. పూడిమడకలోని స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు ముగ్గురూ కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై గురువారం మధ్యాహ్నం బయలుదేరారు. ఈ క్రమంలో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–10 ప్రాంతంలో మలుపు తిరిగే క్రమంలో వాహనం అదుపు తప్పి డివైడర్ పైకి వెళ్లి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో తీవ్ర గాయాలపాలైన సోమేష్, వాసు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన రాజుకు ఉక్కు జనరల్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ ప్రమాద స్థలిని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

మూడు కుటుంబాల్లో తీరని శోకం



వాసు ఇంటి వద్ద విషాదంలో కుటుంబ సభ్యులు

ఎప్పుడు కలిసిమెలిసి ఉండే ముగ్గురు స్నేహితులు ఈ లోకాన్ని వీడి వెళ్లిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. చేతికందొచ్చిన కుమారులు అనంతలోకాలకు చేరడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు. ఉదయం నుంచి రాత్రి వరకు కలిసే తిరిగే ముగ్గురు మిత్రులు ఇకలేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

- కదిరి వాసు (20) తండ్రి భూలోక గతంలో చనిపోవడంతో తల్లి, ముగ్గురు అక్కలతో కలిసి గంగవరంలో నివసిస్తున్నారు. ఇద్దరు అక్కలకు పెళ్లిళ్లు కాగా మూడో అక్కకు పెళ్లి కావల్సి ఉంది. ఇంటికి చిన్నవాడైన వాసుపై కుటుంబం ఆధారపడి ఉండేది. దీంతో ప్లంబింగ్‌తోపాటు ఇతర కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఇద్దరు అక్కల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులను కూడా తానే అన్నీ అయి తీరుస్తున్నాడు. మూడో అక్క పెళ్లి కూడా చేసి తండ్రి బాధ్యతను తీర్చడానికి చూస్తున్న సమయంలో విధికి కన్నుకుట్టింది. దీంతో ఆ కుటుంబం దిక్కులేనిదయింది. ఇక మాకు దిక్కెవరంటూ తల్లీ, అక్కలు రోదించిన తీరు అక్కడి వారిని కలిచి వేసింది.
- అర్జిల్లి సోమేష్ (21) తండ్రి అమ్మోరు గతంలో చనిపోవడంతో తల్లి, తమ్ముడుతో కలిసి గంగవరం గ్రామంలో నివసిస్తున్నారు. సోమేష్ కూడా ఇద్దరు మిత్రులతో కలిసి ప్లంబింగ్‌తోపాటు ఇతర కూలి పనులకు వెళ్తుంటాడు. అతని తమ్ముడు కూడా పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. సాఫీగా సాగిపోతున్న ఆ కుటుంబంలో ఈ ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది. ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారుడు ఇక రాడని తెలియడంతో ఆ తల్లి రోదన వర్ణణాతీతం.
- కొవిరి రాజు (18) తండ్రి నూకరాజు స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికునిగా పనిచేస్తున్నాడు. రాజుకు అక్క, చెల్లి ఉన్నారు. ఇటీవల ఐటీఐ పూర్తి చేసిన రాజు కూడా తన ఇద్దరు మిత్రులతో కలిసి ప్లంబింగ్, ఇతర కూలి పనులకు వెళ్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజు మృత్యువుతో నాలుగు గంటలపాటు పోరాడి... చివరకు తన స్నేహితుల వద్దకు వెళ్లిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడు అందని లోకాలకు చేరుకోవడంతో ఇప్పుడు తమకు దిక్కెవరంటూ తల్లిదండ్రులతోపాటు అక్క, చెల్లి రోదించిన తీరు చూపరులను కలిచివేసింది.

జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కుకు ప్రోత్సాహకాలు

విశాఖ విద్య: విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు లిమిటెడ్‌కు పలు రాయితీలను ప్రకటిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్‌ఎంఈ పార్కులో అల్యూమినియం రిఫనరీ కాంప్లెక్స్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా సంస్థ ముందుకొచ్చింది. రూ.531.36 కోట్లు పెట్టుబడితో 1,166 ఎకరాల్లో ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రభుత్వం ఇది వరకే అనుమతులు ఇచ్చింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా పెద్దమొత్తంలో పెట్టుబడితో ప్రాజెక్టు నిర్వహణకు ముందుకొచ్చిన నేపథ్యంలో దీనిని ప్రోత్సహించేలా ఇండస్ట్రియల్ డవలెప్‌మెంట్ -2023-37 పాలసీ మేరకు రాయితీలను ఇచ్చేలా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్‌ఐపీబీ) ఆమోదం తెలిపి, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ప్రభుత్వానికి నివేదించింది. వీటిలో కొన్నింటికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇండస్ట్రియల్ పార్కు వరకు విద్యుత్, నీటి సరఫరాకు అనుమతి ఇస్తూ, ఇందుకు సంబంధించిన వ్యయాన్ని సంస్థ వెచ్చించాలని సూచించింది. 33 శాతం మించకుండా రెసిడెన్షియల్/కమర్షియల్ నిర్మాణాలు చేసుకునేలా, అదే విధంగా ఐడీపీ 2023-37 పాలసీ మేరకు ఇతర ప్రోత్సాహకాలు వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కానిస్టేబుల్‌పై యువకుల దాడి

మ(దీ)పాలెం: న్యూసెన్స్ చేస్తున్న యువకులను వారించిన కానిస్టేబుల్‌పై దాడి జరిగింది. ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. కంచరపాలెం బర్మాక్యాంపులో విజయరాజు, నీలపు వరప్రసాద్ న్యూసెన్స్ చేస్తున్నారంటూ స్థానికుడు గురువారం డయల్ 100కి ఫిర్యాదు చేశాడు. దీంతో బ్లూకోట్ కానిస్టేబుల్ అక్కునాయుడు బర్మాక్యాంప్ వెళ్లి ఆ యువకులను వారించగా.. వారిద్దరూ అతనిపై దాడి చేశారు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ సమీర్ తెలిపారు. వారు మత్తుమాత్రలు తీసుకున్నట్టు వెల్లడించారు.

అనకాపల్లి అదరహో

ఇది కదా అభిమానమంటే...
ఇది కదా సంక్షేమ పాలనంటే..
ఇది కదా.. అభివృద్ధి అంటే..

అనకాపల్లిలో సామాజిక సాధికార బస్సు యాత్రలో ప్రజాదరణ చూస్తుంటే.. ఊరూవాడా కదిలొచ్చిందా.. జన ప్రవాహమై పరవళ్లు తొక్కిందా.. అన్నట్టుగా జనం బ్రహ్మరథం పట్టారు. జననేత జగన్ జనంలోకి వచ్చినంత సంబ్రమంగా... ఆయన పంపిన దూతలకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ 53 నెలల సంక్షేమ పాలనకు జేజేలు పలికారు.

- జన సునామీలా ఎన్టీఆర్ స్టేడియం
- దద్దరిల్లిన అనకాపల్లి సామాజిక సాధికార సభ
- ఉత్తరాంధ్రలో తొలి విడత యాత్రకు ఘన ముగింపు
- వేలాది బైక్‌లు, వందలాది ఆటోలు, కార్లతో ర్యాలీ


సామాజిక సాధికార సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

సాక్షి, అనకాపల్లి: పట్టణంలో ఎటు చూసినా జన సందోహమే.. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.. దార్లన్నీ ఎన్టీఆర్ స్టేడియం వైపే చూపించాయి. ఇక్కడ మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ జన సంద్రాన్ని తలపించింది. ఈ సందర్భంగా సభలో పలువురు వైఎస్సార్‌సీపీ మంత్రులు, నేతలు ప్రసంగించారు. అంతకుముందు అశేష జనవాహినిలో సాగిన తొలి విడత సామాజిక సాధికార బస్సు యాత్ర ఘనంగా ముగిసింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మారేడుపూడిలో గురువారం ఉదయం 11.30 గంటలకు సామాజిక సాధికార బస్సుయాత్రను వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికిగాను చేపట్టిన ఈ బస్సు యాత్రలో నియోజకవర్గంలో అనకాపల్లి రూరల్, కశింకోట మండలాల నుంచి వేలాది మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వేలాది బైక్‌లు, ఆటోలు, వందలాది కార్లతో ర్యాలీగా సాగింది. ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఆ సమయంలో మహిళల కోలాటాలతోపాటు జై జగన్.. జై గుడివాడ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. మారేడు పూ డి నుంచి జాతీయ రహదారి మీదుగా బస్సు యాత్ర కశింకోట మండలం బయ్యవరం గ్రామానికి చేరు కుంది. ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో పార్టీశ్రేణులు టపాసులతో, మందుగుండు పేలుళ్లతో స్వా గతం పలుకుతూ సందడి చేశాయి. ముందుగా మారే దుపూడికి చేరుకున్న వైవీ సుబ్బారెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛా లను అందించి ఘన స్వాగతం పలికాయి. తేగాడలో జగనన్న కాలనీని, నూతన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో కలిసి ప్రారంభించారు.


మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, పార్టీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు

పేద వర్గాలకు ఉచిత న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

విశాఖ లీగల్ : పేద ప్రజలందరికీ ఉచిత న్యాయ సహాయం అందించడమే న్యాయ సేవ ప్రాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. గురువారం న్యాయ సేవ దినోత్సవాన్ని జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవ ప్రాధికార సంస్థ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నవంబర్ 9వ తేదీన న్యాయ సహాయదినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సత్వర సమన్యాయాన్ని పొందడానికి రాజీమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అందరూ సమానంగా అనుభవించాలన్న ఆలోచనతో న్యాయ సేవ చట్టం వచ్చిందన్నారు. విద్యావంతులు రాజ్యాంగాన్ని తెలుసుకుని తమ హక్కులను, బాధ్యతలను నిర్వర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో మెట్రోపాలిటిన్ ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి, రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, నాలుగో వాదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి, సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు సీనియర్ జూనియర్ సివిల్ జడ్జిలు, మెజిస్ట్రేట్లు, ప్యానల్ న్యాయవాదులు, శిక్షణ పొందిన మీడియేటర్లు, సహాయకులు, లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు రఘుపాత్రుని శ్రీనివాసరావు, బి.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం


మాట్లాడుతున్న జ్యోతి

అథ్లెట్ జ్యోతి

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణంగా ఉందని అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ తెలిపింది. హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆమెకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. వివిధ పాఠశాలల విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి 'సాక్షి'తో మాట్లాడుతూ తన లక్ష్యం ఒలింపిక్స్‌లో పతకం సాధించడమేనని చెప్పింది. అయితే ఇంకా ఎటువంటి ప్రిపరేషన్ మొదలు కాలేదని, కోచ్ నిర్ణయం మేరకు ప్రాక్టీస్ సెషన్ ప్రారంభిస్తానంది. విశాఖ నుంచి ఒలింపిక్స్‌లో అందునా అథ్లెటిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రస్తుతం అయితే వెకేషన్ మూడ్‌లో కుటుంబంతో గడపడానికి విశాఖ వచ్చానంది. నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉంటానని చెప్పింది. ఈసారి దీపావళి పండుగను కుటుంబసభ్యులతోనే జరుపుకుంటానని ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఒలింపిక్స్‌లో శిక్షణ కోసం తిరిగి ముంబయి చేరుకుంటానంది. మహిళా విభాగంలో జాతీయ రికార్డును నెలకొల్పడం.. వంద మీటర్ల హార్డిల్స్‌తో పాటు రెండు వందల మీటర్ల పరుగులోనూ రాణిస్తుండటం చాలా సంతోషంగా ఉందని చెప్పింది. ది ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ, విశాఖ అథ్లెటిక్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతికి ఘనంగా స్వాగతించారు. జ్యోతి కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు.

యువకుడిపై పోక్సో కేసు

సీతమ్మధార : బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడిపై ద్వారకా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతంపేటకు చెందిన ఓ వివాహిత బాలుడు, బాలికతో కలిసి నివాసం ఉంటోంది. భర్త మరణించడంతో ఇంటి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటుంది. అదే ప్రాంతానికి చెందిన సత్యనారాయణ(40) అనే వ్యక్తి ఆమె పట్ల అనేక సార్లు అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఎప్పటికైనా మార్పు వస్తుందని ఉద్దేశంతో ఆమె తన పని తాను చేసుకునేది. బుధవారం స్కూల్‌కు సెలవు కావడంతో తల్లితో పాటు కుమారుడు పనికి వెళ్లిపోయాడు. 14 సంవత్సరాలు కుమార్తె ఇంటి వద్ద ఉండడం గమనించిన సత్యనారాయణ మద్యం మత్తులో వెళ్లి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారంతా వచ్చి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాట్లు కళ్లు చెదిరె..!

ప్రారంభమైన రాష్ట్ర అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ


బ్యాడ్మింటన్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో చంద్రకళ, అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

విశాఖ స్పోర్ట్స్: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం 67వ పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్ర అంతర్ జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్ 14, 17 బాల బాలికలకు తొలి రోజు టీమ్‌గా పోటీలు నిర్వహించగా.. ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ దేశంలో క్రీడాకారులు ఒలింపిక్‌లో పాల్గొనే స్థాయి నుంచి పతకాలు సాధించే స్థాయికి ఎదిగారన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల క్రీడా ప్రతిభను గుర్తించే వ్యాయామ ఉపాధ్యాయులు.. పాఠశాల విద్య అనంతరం కూడా వారు క్రీడల్లో కొనసాగే విధంగా ప్రోత్సహించాలన్నారు. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ సహాయ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలుత చెప్పిన విషయాన్ని శ్రద్ధగా ఆలకించడం, ఆచరించేప్పుడు విషయాన్ని ఆకళింపు చేసుకోవడం ముఖ్యమన్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలల క్రీడా సమాఖ్య సర్టిఫికెట్‌కు ఎంతో విలువ ఉందని, దాన్ని సాధించి జీవితంలో ఎదగాలన్నారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి.. చిన్నారులతో క్రీడాప్రతిజ్ఞ చేయించారు. కాసేపు అతిథులు బ్యాడ్మింటన్ ర్యాలీలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఎస్జీఎఫ్ విశాఖ జిల్లాల నిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరావు, పరిశీలకులు గణేష్, శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు అప్పలరాజు, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-17లో ఫైనల్స్‌కు విశాఖ


విశాఖను ఫైనల్స్‌కు చేర్చిన బాలప్రణయ్


ఎస్జీఎఫ్ బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్ అండర్-17లో విశాఖ బాలుర జట్టు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆయా విభాగాల్లో తలపడుతున్న 13 జిల్లాల జట్లను నాలుగు పూల్స్‌గా విభజించారు. అండర్-17 విశాఖ బాలుర జట్టు కర్నూలుపై 2-0 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు వెళ్లింది. సింగిల్స్‌లో కెప్టెన్ బాలప్రణయ్ విశాఖ జట్టుకు ఆధిక్యాన్నందించి.. డబుల్స్‌లో వేణుతో కలిసి సాధించిన విజయంతో రివర్స్ సింగిల్స్ ఆడకుండానే జట్టును ఫైనల్స్‌కు చేర్చాడు. మరో సెమీస్‌లో కృష్ణా జట్టుతో పశ్చిమగోదావరి జట్టు తలపడనుంది. బాలికల విభాగం తొలిసెమీస్‌లో విశాఖతో పశ్చిమగోదావరి, మరో సెమీస్‌లో గుంటూరు జట్టుతో తూర్పుగోదావరి జట్టు పోటీపడనుంది. ఇక అండర్ 14 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జట్టుతో అనంతపురం, విశాఖతో తూర్పుగోదావరి జట్టు తలపడనుంది. బాలికల విభాగంలో అనంతపురంతో విశాఖ, కృష్ణాతో శ్రీకాకుళం జట్టు పోటీపడనున్నాయి. లీగ్ దశలో ఆయా పూల్స్‌లో ఆధిక్యంలో నిలిచి జట్లు నాకవుట్‌కు చేరుకుని సెమీస్‌లో తలపడుతున్నాయి.

నడిసంద్రంలో మత్స్యకారులు

- బోటు మరమ్మతులతో ఇబ్బందులు
- రేవుపోలవరం తీరానికి చాలా దూరంలో ఉన్నామని సర్పంచ్‌కు ఫోన్.. అంతలోనే సిగ్నల్ కట్
- కుటుంబ సభ్యుల ఆందోళన


పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తిక్కవానిపాలెం సముద్ర తీరంలో మంగళవారం రాత్రి చేపల వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆచూకీ లేని మత్స్యకారుల కోసం పరవాడ పోలీసులు, రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపట్టింది. సర్పంచ్ చేపల మసేను అందించిన వివరాలిలా ఉన్నాయి. తిక్కవానిపాలేనికి చెందిన చేపల మహాలక్ష్మి, అప్పారావు, ముసలయ్య, పరదేశి, దూడ నూకాలు, గంగులు మంగళవారం రాత్రి పడవపై చేపలవేటకు వెళ్లారు. చేపల వేట ముగించుకొని బుధవారం తెల్లవారు జామున తీరానికి చేరుకోవాలి. కానీ వారి జాడ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం చేరవేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలావుండగా చేపలు వేటకువెళ్లిన మత్స్యకారులు గురువారం ఉదయం సర్పంచ్ మసేనుకు ఫోన్ చేశారు. పడవ మరమ్మతులకు గురవ్వడంతో గాలివాటంతో ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం తీరానికి చాలా దూరంలో ఉన్నామని, రెండు రోజులుగా తిండి తిప్పలు లేక అల్లాడుతున్నామని మత్స్యకార్మికులు తెలిపారని సర్పంచ్ మసేను చెప్పారు. మళ్లీ సిగ్నల్ సమస్య కారణంగా ఫోన్ కలవలేదన్నారు. వారి క్షేమ సమాచారం కోసం రేవుపోలవరం తహసీల్దార్‌కు, స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులకు సమాచారం అందజేశామని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ కమర్షియల్ డైరెక్టర్‌గా ప్రసాద్


నాగాంబిక ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(కమర్షియల్)గా జనరల్ మేనేజర్ ఘంటసాల వెంకట నాగాంబిక ప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుత డైరెక్టర్(కమర్షియల్) పదవీ విరమణ చేయనుండడంతో గురువారం పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు(పీఈఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూకు స్టీల్‌ప్లాంట్ నుంచి నలుగురు, సెయిల్ నుంచి ఒకరు, నేషనల్ సీడ్ కార్పొరేషన్ నుంచి ఒకరు, నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ నుంచి ఒకరు హాజరయ్యారు. వీరిలో నాగాంబిక ప్రసాద్‌ను ఎంపిక చేస్తూ పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 1982లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లమో పూర్తి చేసిన ప్రసాద్ స్టీల్‌ప్లాంట్‌లో సీనియర్ ట్రైనీగా చేరారు. బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం పీసీఎం సెక్షన్‌లో చార్జిమెన్‌గా విధులు నిర్వర్తించారు. ఇలా ప్రసాద్ డైరెక్టర్ స్థాయికి ఎదగడంపై ఉక్కు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈకోర్స్ లిఫ్టర్లకు పతకాల పంట


ప్రియదర్శిని, సంతోషి, రమణ, సత్యజ్యోతి

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఈకో రైల్వే వాల్తేర్ లిఫ్టర్లు పతకాలు సాధించారు. వెస్ట్రన్ రైల్వే ముంబయిలో 70వ మెన్, 9వ వుమెన్ చాంపియన్‌షిప్ జరిగింది. 45 కిలోల వెయిట్‌లో టి.ప్రియదర్శిని రజతం, 55 కిలోల వెయిట్‌లో ఎం.సంతోషి కాంస్య పతకం అందుకుంది. 67 కిలోల వెయిట్ కేటగిరీలో కె.రమణ, 87 కిలోల వెయిట్‌లో టి.సత్యజ్యోతి కాంస్య పతకాలు సాధించారు. వీరిని డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ అభినందించారు.

పలు అభివృద్ధి అంశాలపై సీఎస్ సమీక్ష


వీడియో కాన్ఫరెన్స్‌లో విశాఖ నుంచి పాల్గొన్న పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్

మహారాణిపేట: పలు అభివృద్ధి అంశాలు, సంక్షేమ పథకాలు అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీసర్వే, గోదాముల నిర్మాణం, గృహ నిర్మాణాలు, ఇతర మౌలిక వసతుల కల్పనలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అభివృద్ధి పనుల్లో మరింత ప్రగతి కనబరచాలన్నారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చెస్ విజేతలు శశాంక్, యశస్వి


చిన్నారి నిత్యను అభినందిస్తున్న చెస్ టోర్నీ నిర్వాహక ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి స్కూల్ విద్యార్థుల చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. 6 నుంచి 16 ఏళ్ల వయస్సు చిన్నారులకు పలు కేటగిరీల్లో ఆల్ విశాఖ చెస్ సంఘం పర్యవేక్షణలో ఆదిత్య చెస్ అకాడమీలో ఈ పోటీలు నిర్వహించారు. అండర్-6 బాలురలో శశాంక్, సృజయ్, అభిరామ్, బాలికల్లో యశస్వి, ఆశ్రిత, సాయి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-8 బాలురలో సాయిశ్రేయాస్, సాత్విక్, శ్రీయాన్, బాలికల్లో గుణశ్రీ, ముస్కాన్, దివ్యదర్శిని తొలి మూడు స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. అండర్-12 బాలురలో రామన్, నరేన్, వెంకటేష్, బాలికల్లో నయన, శ్రావ్యశ్రీ, ఆముక్త తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-14 బాలురలో భాస్కర్, కార్తీక్, నిహాల్, బాలికల్లో జాగృతి, నిధి, అక్షయ, అండర్-16 బాలురలో సాత్విక్, ధనుష్, రాఘవ్, బాలికల్లో జాహ్నవి, హాసిని, అమూల్య తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా మూడున్నరేళ్ల ప్రాయంలో ప్రతిభ చూపి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించిన నిత్య, కోచ్ రవితేజను ప్రతినిధులు సత్కరించారు. పోటీలను సెంచూరియన్ వర్సిటీ చాన్సలర్ జి.ఎస్.ఎన్.రాజు ప్రారంభించగా.. విజేతలకు పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, చెస్ సంఘం కార్యదర్శి మణికంఠ, ఆర్బిటర్లు రామకృష్ణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.